మహాలక్ష్మీ నమోస్తుతే..

క్లుప్తంగా

దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి ఉషశ్రీ చరణ్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహిళలను శక్తిగా భావించే గొప్ప వ్యక్తి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని, దసరా ఉత్సవాలు ఏర్పాట్లు చాలా చక్కగా ఉన్నాయని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. మహాలక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మను మంత్రి ఉషశ్రీ చరణ్ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రి ఉషశ్రీ చరణ్‌ను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ ఈవో కేఎస్ రామారావు అమ్మవారి ప్రసాదాలు అందచేశారు. అనంతరం మీడియా పాయింట్‌లో మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడారు. మహాలక్ష్మీ అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉత్సవాల ఏర్పాట్లు చాలా బాగా చేశారన్నారు. భక్తులు ఎంతో సంతృప్తిగా అమ్మవారిని దర్శించుకుంటున్నారన్నారు.

భద్రత ఏర్పాట్లు పర్యవేక్షణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆలయ పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఇతర అధికారులతో కలిసి పర్యవేక్షించారు. బందోబస్తు సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఆయన భక్తులు అమ్మవారి దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గం ద్వారా నడుచుకుంటూ కనకదుర్గ నగర్, అన్నప్రసాద వితరణ ప్రదేశం, ప్రసాదం కౌంటర్ల వద్ద రద్దీని పరిశీలించారు. ప్రతి సెక్టార్‌లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందితో ఎక్కడ ఎటువంటి పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. అందరికీ అమ్మవారి దర్శనం అయ్యేలా చూడాలని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు ఎక్కడా ఇబ్బంది పడకుండా ప్రశాంత వాతావరణంలో అమ్మవారి దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీసీపీ విశాల్ గున్నీ, ఏఐజీ ఎం. రవీంద్ర బాబు, ఆలయ ఈఓ కెఎస్ రామారావు, సీఎస్‌బీ ఏడీసీపీ సీహెచ్ లక్ష్మీపతి, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మొయిన్ డ్రైయిన్ ఆధునీకీకరణ ప్రారంభం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని ఇస్లాంపేట ప్రధాన డ్రైన్ ఆధునికీకరణ పనులను బుధవారం ప్రారంభించారు. 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. డివిజన్‌లోని బీఆర్పీ రోడ్డులోని జెండా చెట్టు సెంటర్ నుంచి మినార్ మసీదు కాంప్లెక్స్ వరకూ ఉన్న డ్రైన్‌ను వెడల్పు చేయటంతో పాటుగా ఆధునికీకరించేందుకు సుమారు రూ.18 లక్షలతో ఈ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రాక్టర్ డిస్పోసబుల్ అసోసియేషన్ అధ్యక్షుడు చాన్‌బాషా, కార్యదర్శి జలీల్, శ్రీశైలం దేవస్థానం సభ్యుడు గురు మహంతు మహేష్, నాయకులు హబీబ్, యూసుఫ్ ఖాన్, మెహబూబ్, ఖాజా, కౌసర్, షబ్బీర్, పడాల రాజేష్, సమీర్, అన్వర్, రెహమాన్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా కూచిపూడి నృత్యాలు



విజయవాడ కల్చరల్: దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా సాంస్కృతిక మహోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా ఆకట్టుకుంటున్నారు. గన్నవరానికి చెందిన వల్లభనేని లక్ష్మీ వసుంధర చేసిన భరతనాట్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జతిస్వరం, పుష్పాంజలి, థిల్లానా అంశాలను ప్రదర్శించింది. నాట్యాచార్యుడు భాగవతుల శ్రీనివాస శర్మ, అన్నమయ్య కీర్తన పలుకుతేనియ తల్లి, రామదాసు కీర్తన ఇదిగో భద్రాద్రి కీర్తనలకు నృత్యాలను అభినయించారు. మంగళగిరికి చెందిన డి.ప్రసన్న, తెనాలికి చెందిన ఎం. లక్ష్మీకార్తీక్, పి.రోహిత, డి.సరస్వతీ గౌరీ, ఆర్.శ్రీనివాసరావు అనుపమ బృందాలు కూచిపూడి కీర్తనలకు నృత్యాలు ప్రదర్శించారు. భక్తి సంగీత కార్యక్రమంలో వెంకటరమణ, వి.సుకన్య, ఎస్ వైష్ణవి, వైదేహి భక్తి గీతాలను మిసక్‌రాజు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. సాంస్కృతిక కార్యక్రమాల పర్యవేక్షకుడు సైదా, గంగాధర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో కొలువుదీరిన అమ్మవార్లు బుధవారం మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మీ అలంకారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. ఆయా ఆలయాల్లో మహాలక్ష్మీ స్వరూపంలో దర్శనమిస్తున్న అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. సకల సృష్టికి ఐశ్వర్యాన్ని ప్రసాదించే మహాలక్ష్మీని భక్తులు భక్తి శ్రద్ధలతో కొలిచారు. తెల్లవారుజాము నుంచి ఆయా ఆలయాల్లో అర్చక స్వాములు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఆయా ఆలయాల్లో కొలువై ఉన్న ఇతర దేవతా మూర్తులకు సైతం విశేష పూజలు చేశారు. శ్రీనివాసమహల్ సెంటర్‌లో కొలువై ఉన్న గంగానమ్మ వారి దేవస్థానంలో అమ్మవారు బుధవారం మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల పెద్ద సంఖ్యలో గంగనమ్మ మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఉభయదాతలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చలను నిర్వహించారు. బ్రాహ్మణవీధిలోని చదునుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలతో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అష్టలక్ష్మి దేవాలయంలో అమ్మవార్లకు విశేష అలంకారం గావించారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం (పాతశివాలయం)లో కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మవారు లలితాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. అమ్మవారికి ఉదయం నుంచి ఉభయదాతలు కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మల్లేశ్వరస్వామి వారికి పలు విశేష అర్చనలు నిర్వహించారు. చండీహోమం, ఖడ్గమాలార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా స్వామి వారికి రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయంలో జరిగిన ఉత్సవ కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగరాజు పర్యవేక్షించారు. వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో కొలువుదీరిన శ్రీ పద్మావతి అమ్మవారు ధనలక్ష్మీ దేవిగా భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ ఆగమ పండితులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకస్వాములు దీక్షిత్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల శ్రీనివాస్ పర్యవేక్షించారు. శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో కొలువై ఉన్న కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజనమండలి ఆధ్వర్యంలో సంకీర్తనాగానం జరిగింది. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, కార్యదర్శి గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు. కొత్తపేట సైకం వారివీధిలోని శ్రీ దర్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో కొలువై ఉన్న పార్వతీదేవి మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మీ అలంకారంలో ఉన్న అమ్మవారికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. ఉభయదాతలు అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయ అర్చకులు మురళీ పర్యవేక్షించారు.



మహాలక్ష్మీ దేవిగా దర్శనమిస్తున్న చదును మహాలక్ష్మీ




ధనలక్ష్మీదేవిగా పద్మావతి అమ్మవారు



మహాలక్ష్మీదేవిగా గంగానమ్మ అమ్మవారు



లలితా త్రిపురసుందరిదేవిగా భ్రమరాంబ అమ్మవారు



మహాలక్ష్మీ అలంకారంలో అమ్మవారు



అన్నపూర్ణాదేవిగా మహాలక్ష్మీ అమ్మవారు



కరకట్ట వద్ద ధనలక్ష్మీగా అమ్మవారు



అన్నపూర్ణాదేవిగా లలితాంబికా అమ్మవారు



భీమన వారి పేట ఆలయంలో...

మహాలక్ష్మికి కుంకుమార్చనలు

కన్యకా పరమేశ్వరీ విస్సంశెట్టి వేంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో చేపట్టిన రుద్ర సహిత అష్టోత్తర శత చండీయాగం అత్యంత వైభవంగా కొనసాగుతోంది. కేబీఎస్ కళాశాల ప్రాంగణంలోని దాసాంజనేయస్వామి వారి దేవస్థానం సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని చేపట్టిన రుద్ర సహిత అష్టోత్తర శత చండీయాగం కార్యక్రమంలో భాగంగా బుధవారం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 500 మంది మహిళలు కుంకుమార్చన చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసి అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి అలంకారానికి సంబంధించిన మూలమంత్ర సంపుటితో చండీ హోమం చేశారు. రుద్ర, సుదర్శన, లక్ష్మీగణపతి, గరుడ, మృత్యుంజయ, మన్యుసూక్త, నవగ్రహ హోమాలు కొనసాగించారు. ఉదయం కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి గోళ్ల బాబావిజయ కుమార్, కేబీఎస్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసు, పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి పీ లక్ష్మణస్వామి తదితరులు వైదిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 56 మంది చండీ యాగంలో పాల్గొన్నారు. అలాగే ఆంజనేయస్వామి వారి దేవస్థానంలోనూ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని మహాలక్ష్మీ ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారిని బుధవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అమ్మవారిని దర్శించుకున్నారు. ద్వారకా తిరుమలరావుకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఏషియన్ గేమ్స్ ఆర్చరీలో బంగారు పతకాన్ని సాధించిన జ్యోతి సురేఖ, మేయర్ రాయన భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లను దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. భీమనవారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు చేశారు. అమ్మవారికి పంచహారతుల సేవ జరిగింది. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు నిర్వహించారు. భవానీ దేవస్థాన కమిటీ ఆధ్వర్యాన అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించగా పలువురు ఉభయదాతలు భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించగా, ఆలయ అర్చకులు దంటు భవానీశర్మ పూజలు నిర్వహించారు. ఆంజనేయవాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి సన్నిధిలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మహా చండీ యాగం నిర్వహించారు. ఉభయదాతలు తమ్మిశెట్టి అశోక్‌కుమార్, శాంతి దంపతులు పూజలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు యాగాన్ని వీక్షించారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పర్యవేక్షణలో పూజలు నిర్వహించగా, ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని లలితాంబికా పీఠంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ విశేష అభిషేకాలు నిర్వహించగా, ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు, పంచహారతుల సేవ జరిగింది. ఉత్సవ ఏర్పాట్లను పీఠం కన్వీనర్ రాంపిళ్ల చైతన్య పర్యవేక్షించారు.



కుంకుమార్చనలో పాల్గొన్న దంపతులు



మహాలక్ష్మీ ఆలయంలోని పూజలో భక్తులు



కేదారేశ్వరపేటలో మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చిన శివకాళేశ్వరిదేవి

మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): కేదారేశ్వరపేటలో కొలువుదీరిన శివకాళేశ్వరి దేవి బుధవారం మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. దేవదేవిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్న భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు అమ్మవారి కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు పట్టారు. పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళలు, భవానీలు, అయ్యప్ప దీక్షాదారులు, ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దుర్గమ్మ దయతో రాష్ట్రం సుభిక్షం

మంత్రి చెల్లుబోయిన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు సంపూర్ణమైన ఆశీస్సులు అందించాలని దుర్గమ్మను కోరుకున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మహాలక్ష్మీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను మంత్రి చెల్లుబోయిన బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హోరుతుల్లో పాల్గొన్నారు. తొలుత ఆలయ అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి అమ్మవారి సన్నిధికి తీసుకెళ్లారు. దుర్గమ్మ దర్శనం అనంతరం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను మంత్రికి అందించారు. మీడియా పాయింట్‌లో మంత్రి మాట్లాడుతూ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి పరిపాలనకు అమ్మశక్తి అడుగడుగునా తోడుగా ఉండాలని పూజించినట్లు చెప్పారు. దుర్గమ్మ దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. సామాన్యుడు, సంపన్నుడు అనే తేడా లేకుండా అమ్మవారి దర్శన భాగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. పొన్నూరు శాసనసభ్యులు రోశయ్య, గన్నవరం శాసనసభ్యులు వంశీ తదితరులు సైతం అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారి సన్నిధిలో మంత్రి చెల్లుబోయిన, పొన్నూరు ఎమ్మెల్యే రోశయ్య

స్మృతి వనం పనుల పరిశీలన

పటమట: స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం, స్మృతివనం పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. కారిడార్ చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ, ఏర్పాటు చేసిన గ్రీనరీని సందర్శించారు. ఖాళీగా ఉన్న ప్రదేశంలో పూర్తి స్థాయిలో గ్రీనరీ పెంపొందించాలని ఉద్యానవన విభాగం అధికారులను ఆదేశించారు. లైటింగ్, గ్రానైట్, పాత్ వే, వాటర్ ఫౌంటైన్, వెహికల్ పార్కింగ్, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ, సుందరీకరణ తదితర పనులతో పాటు మ్యూజియం, థియేటర్ సందర్శించి అక్కడ ఎలక్ట్రిసిటీ పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

భక్తులకు ఉచిత వైద్య సేవలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు విజయవాడ సూర్యారావుపేటకు చెందిన ఎంజే నాయుడు హాస్పటల్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా భక్తులకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలు బుధవారం కూడా కొనసాగాయి. అమ్మవార ఆలయానికి చేరువలో రాజగోపురం వద్ద ఏర్పాటటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో ఎముకలు, కీళ్లు, నరాలు, కండరాల సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. అలాగే బీపీ, షుగర్‌లతోపాటు కీలకమైన ఎముకల అరుగుదల పరీక్షలు చేసి నివారణ మందులు అందచేశారు. హాస్పటల్ ఫౌండేషన్ గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత శర్మ పర్యవేక్షణలో హాస్పటల్ వైద్యులు ఎంజె నాయుడు, ఎం రవితేజ, ఎం వంశీకృష్ణ, గౌతమ్, నాగేశ్వరరావు, మహేష్‌లు పాల్గొని వైద్య సేవలు అందచేశారు.

దసరా ఉత్సవ ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి

మంత్రి కొట్టు సత్యనారాయణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల ఏర్పాట్ల పట్ల భక్తులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. మహా మండపం దిగువన ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణను బుధవారం మంత్రి, జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఈవో కేఎస్ రామారావు తదితర అధికారులు పరిశీలించారు. అమ్మవారి అన్నప్రసాదం స్వీకరిస్తున్న పలువురు భక్తులతో మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడారు. భక్తులతో కలిసి మంత్రి, కలెక్టర్, ఆలయ ఈవో అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే క్రమంలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని ఆరా తీయడమే కాకుండా అన్న ప్రసాదం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. దేవస్థానం చేసిన ఏర్పాట్లతో పాటు అన్న ప్రసాద వితరణపై భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఉత్సవాల్లో మిగిలిన 5 రోజులు ఇదే క్రమశిక్షణతో నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. మంత్రి వెంట సబ్ కలెక్టర్ అదితిసింగ్, దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

ప్రతి రోజు సమీక్ష..

దసరా ఉత్సవాల సందర్భంగా చేసిన ఏర్పాట్లలో ఏమైనా చిన్న చిన్న లోపాలు ఉంటే వారిని సరిచేసుకునేందుకు సమీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ఎటువంటి అవాంతరాలు లేకుండా దసరా ఉత్సవాలు కొనసాగుతున్నాయని, చిన్న చిన్న లోపాలను గుర్తించి వాటిని పరిష్కరించడమే కాకుండా రానున్న రోజుల్లో ఎటువంటి ఏర్పాట్లు చేయాలనే దానిపై సమీక్ష చేస్తున్నామన్నారు. అమ్మవారి అలంకారాలు, ఉత్సవ ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు.



భక్తులతో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ ఢిల్లీరావు

రొమ్ము క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రొమ్ము క్యాన్సర్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలని రైల్వే హాస్పటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల తెలిపారు. ప్రపంచ రొమ్ము క్యాన్సర్ మాసోత్సవాలను పురస్కరించుకుని రైల్వే హాస్పటల్లోని న్యూ ఓపీడీ భవనంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శౌరిబాల మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 'పింక్ అక్టోబర్' పేరుతో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. 40 ఏళ్లు దాటిన ప్రతి మహిళ తప్పకుండా హెల్త్ చెకప్‌లు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్‌పై పూర్తి అవగాహన కలిగిం ఉండాలని తెలిపారు. క్యాన్సర్ నివారణ కోసం తీసుకోవాల్సిన ఆహార అలవాట్లు, జీవనశైలి మార్పులు వంటి సలహాలను సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్ అంకాలజిస్ట్ డాక్టర్ అనీల పాటిబండ్ల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్యాన్సర్ వ్యాధికి గల కారణాలు, వాటి లక్షణాలు, ముందస్తు గుర్తింపుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్, గైనకాలజిస్ట్ డాక్టర్ శరద, 150 మంది మహిళలు పాల్గొన్నారు.

జగన్మాతా... కరుణించమ్మా..













జగన్మాతా..కరుణించమ్మా.. అంటూ భక్తులు మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మను బుధవారం దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివస్తున్న భక్తులు ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకొని ఆనందంతో తన్మయత్వం చెందుతున్నారు. పండగ సందడితో కోలాహలంగా మారిన కొండంతా భక్తజన సంద్రంతో నిండి పోయింది. మహిళలు ఆర్జిత సేవల్లో భాగంగా ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ